క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఆర్డీవో జి.వి.రమణాకాంత్ రెడ్డి



గురజాల: ప్రశాంత ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.రమణాకాంత్ రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. కోడ్ ఉల్లంఘన చేయరాదన్నారు. హోమ్ ఓటింగ్ ఓటర్ల వివరాలు, ఓటింగ్ సరళి విషయాల గురించి సలహాలు, సూచనలు అందించారు. ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. అనంతరం ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని మండలాల పలు పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సెలవుపై ఎంపీపీ



దాచేపల్లి : దాచేపల్లి ఎంపీపీ పదవికి కటకం జయశ్రీ సెలవు పెట్టారు. కుటుంబ అవసరాల నేపథ్యంలో ఎంపీపీ బాధ్యతలకు సెలవు పెడుతున్నట్లు మంగళవారం ఆమె ఓ ప్రకటనలో వెల్లడించారు. జెడ్పీ అధికారులకు సమాచారం అందించామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాచర్ల: విద్యుత్ డివిజనల్ కార్యాలయ పరిధిలో 33/11కేవీ ఎస్ఎస్ జామ్, వివిధ ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతులు పురస్కరించుకొని మాచర్ల పట్టణ, రూరల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.రామయ్య తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బుధవారం టౌన్ పరిధిలో నేషనల్ హైవే పనులు చేస్తున్న నేపథ్యంలో కరెంట్ కోత విధిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు కోత విధిస్తున్నట్లు పేర్కొన్నారు. తాళ్ళపల్లి 33/11 కేవీ ద్వారకాపురి, జమ్మలమడక, తాళ్ళపల్లి ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేయటం జరుగుతుందన్నారు. సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం ఈ పనులు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలన్నారు.

మాచర్ల కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ రామచంద్రారెడ్డి



మాచర్ల: నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ యరమల రామచంద్రారెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. మాచర్ల పట్టణ నివాసియైన డాక్టర్ రామచంద్రారెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అధిష్టానం నిర్ణయించుకొని మంగళవారం 114 అభ్యర్థుల జాబితాలో ఆయన పేరును ప్రకటించారు. కాంగ్రెస్ తరపున 2019లో పోటీ చేసిన ఆయన తిరిగి 2024లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

మజ్జిగ పంపిణీ



పెదకూరపాడు: మండల కేంద్రంలో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో గుడిపూడి కాంతరావు జ్ఞాపకార్థంగా బాటసారులకు మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. గుడిపూడి బ్రదర్స్ ఆదిశేఖర్, సాగర్‌బాబు మాట్లాడుతూ.. వ్యవసాయకూలీలు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జన చైతన్య సమితి కోఆర్డినేటర్ తుళ్ళూరు సాంబశివరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు బెన్నిబాబు, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



బెల్లంకొండ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా పోలీసులు ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. బెల్లంకొండ, మాచాయపాలెం క్రాస్ రోడ్ల వద్ద మంగళవారం తెల్లవారుజాము నుంచి తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ.. పెద్ద మొత్తంలో నగదు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి రోజూ వాహనాల తనిఖీ చేస్తామన్నారు. ఏఎస్ఐ మునలారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

- జేసీ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్
- పోలింగ్ కేంద్రాలు, అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ పరిశీలన



నాగార్జునసాగర్ అంతర్రాష్ట్ర పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, విజయపురిసౌత్: ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, ఓటర్లకు టెంట్ సౌకర్యంతో పాటు, మరుగుదొడ్లు, వీల్ చైర్‌లు కచ్చితంగా ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లి, కొప్పునూరు పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, స్వతంత్రంగా వినియోగించుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గ్రామాలలో ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకొని తగు చర్యలు తీసుకోవటంలో పోలీసు అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్ పరిశీలన..

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా–తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని నాగార్జున సాగర్ అంతర్రాష్ట్ర పోలీస్ చెక్‌పోస్ట్‌ను మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మంగళవారం సందర్శించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఆ సమయంలో వీడియో చిత్రీకరించి సీజ్ చేసిన వాహనాలను ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వాహనాల రాకపోకలపై నిఘా పెట్టి పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మాచర్ల మండలంలోని విజయపురి సౌత్, తాళ్ళపల్లి, ఏకోనాంపేట, పశువేముల, కొత్తూరు, బ్రహ్మానందపురం తండా, సుబ్బారెడ్డి పాలెం, చింతలతండాలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. చింతలతండా గ్రామంలో జరుగుతున్న రేషన్ పంపిణీని తనిఖీ చేసి లబ్ధిదారులకు ఇచ్చే ఫోర్టిఫైడ్ బియ్యం, కందిపప్పు, పంచదారను పరిశీలించారు. ఆయన వెంట మాచర్ల తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో సరోజిని, ఎంఈవో అల్లి సురేష్, ఏఈ బాబులాల్ నాయక్, సెక్టార్ ఆఫీసర్ మురళీధర్, ఆర్ఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటకొండారెడ్డి, డీటీ షేక్ బాషా, ఏఎస్‌వో ప్రభాకర్, ఆర్ఐ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



బ్రహ్మానందపురం పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న జిల్లా జేసీ, ఆర్‌వో శ్యాంప్రసాద్



విజయపురిసౌత్‌లోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌వో, జేసీ శ్యాంప్రసాద్

రాజకీయ పార్టీలు నిబంధనలు కచ్చితంగా పాటించాలి

మాచర్ల రూరల్: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను రాజకీయ పార్టీలు కచ్చితంగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాం ప్రసాద్ కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల క్లయిమ్స్, అబ్జెక్షన్స్, నామినేషన్ ప్రక్రియ తదితర అంశాలపై వారితో చర్చించారు. అలాగే ఎన్‌కోర్/సువిధ, ఎంసీసీ మొదలైన వాటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఓటర్లకు తాము కల్పిస్తున్న సౌకర్యాలను వివరిస్తూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ కొర్రా వెంకటేశ్వరరావు, బీజేపీ, టీడీపీ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పార్టీల నాయకులతో మాట్లాడుతున్న జేసీ, ఆర్‌వో శ్యాంప్రసాద్

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: మండల కేంద్రమైన కారెంపూడికి చెందిన 20 వడియరాజుల కుటుంబాల వారు టీడీపీని వీడి మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ విప్ పీఆర్కే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పేదల అభ్యున్నతి కోసం వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ కేడర్‌కు ప్రభుత్వ విప్ పీఆర్కే ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాకుండా ప్రతి నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న తీరు నచ్చి, అదే విధంగా ఇలాంటి మంచి మనస్సున్న ప్రభుత్వ విప్ పీఆర్కే వెంట నడవాలని ఎన్నికల్లో ఆయన విజయంలో పాలుపంచుకోవాలని ఆశించి పార్టీలో చేరుతున్నట్లు పార్టీలో చేరిన వారు తెలిపారు. మేము టీడీపీకి చెందిన వాళ్లమయినా మాకు వర్తించిన అన్ని సంక్షేమ పథకాలు అందాయని వివక్ష చూపలేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, మండల పార్టీ కార్యదర్శి పాతూరి రామిరెడ్డి, మండల పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, మేకల శ్రీనివాస రెడ్డి, కొమ్ము చంద్రశేఖర్, వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు కొమెర పిచ్చియ్య, బత్తుల బైరాగివర్మ, ఎంపీటీసీ వేముల లింగయ్య, కొమెర సూరి, చల్లా శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల



ఎన్నికల ప్రచారంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న యెనుముల, కేవీ

గురజాల : 45 రోజుల్లో జరుగు ఎన్నికల్లో అభివృద్ధిని చూసి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)లు అన్నారు. మండల పరిధిలోని గంగవరం గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి జరిగిందన్నారు. ప్రతి ఒక్కరికి అర్హత ఉంటే చాలు ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఇంటికి వివరిస్తూ ముందుకు సాగారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డిని గెలిపించి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, మాజీ ఎంపీపీ వి.అమరారెడ్డి, సీనియర్ నాయకులు కొమ్మినేని బుజ్జి, వేముల చలమయ్య, కో ఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, బ్రహ్మం, చంటి తదితరులున్నారు.

రామాలయం నిర్మాణం చేపట్టడం హర్షణీయం

డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల



నిర్వాహకులు శౌరినాయక్‌కు నగదు అందజేస్తున్న డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎర్రబాలెం కాలనీలో రామాలయం నిర్మాణం చేపట్టడం హర్షణీయమని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఎర్రబాలెం కాలనీలో నిర్మిస్తున్న రామాలయం పనులను పరిశీలించి తనవంతు రూ.13,500 విరాళం నిర్వాహకులు బి.శౌరినాయక్‌కు అందజేసి మాట్లాడారు. శ్రీ రాముడు హిందువులకు ఆరాధ్యదైవం అని ధర్మ మార్గాన్ని అనుసరించి నైతిక సూత్రాలను విడువని ఆదర్శప్రాయుడుగా కీర్తింపబడుతున్నారన్నారు. భక్తికి చిహ్నంగా ఆరాధిస్తారని... నీతి, నిజాయితీ, చిత్తశుద్ధి, కరుణ, పెద్దల పట్ల గౌరవం వంటి ఎన్నో సుగుణాలు ఉన్న పరిపూర్ణమైన ఆదర్శవంతుడిగా పేరు పొందారని కొనియాడారు. కాలనీ ప్రజలు విరాళాలు సేకరించి రామాలయం నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నెమలికంటి కేశవులు, కేతావత్ కిర్యా, బానావత్ హనుమనాయక్, రామావత్ మోతిలాల్ నాయక్ తదితరులున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి పలువురికి గాయాలు

మాచవరం: కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడడంతో పలువురికి గాయాలైన ఘటన మాచవరంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాచవరం గ్రామానికి చెందిన 30 మంది కూలీలు మిరప కాయలు కోసేందుకు ట్రాక్టర్‌లో పిన్నెల్లి గ్రామం వెళుతున్నారు. మాచవరం గ్రామ సమీపంలో వాగు వద్ద మూల మలుపు తిరిగే సమయంలో అదుపుతప్పి ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

వెల్దుర్తిలో ఆరోగ్య సురక్ష



వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ బత్తిన శ్రీరామ్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ క్యాంపులో 319 రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుంచి చెవి, ముక్కు, గొంతు వైద్యులు లక్ష్మీప్రసన్న, రేవతి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి

రెంటచింతల: భారత రాజ్యాంగం వయోజనులైన ప్రతి ఒక్కరికి కల్పించిన పవిత్రమైన ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కె.వెంకట నారాయణరెడ్డి కోరారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ లోతేటి శివశంకర్, జేసీ, నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని రెంటాల, మంచికల్లు గ్రామాలలోని ప్రజలకు శాంతి భద్రతల సమస్యలు, ఓటు హక్కుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2024 మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు చట్టం తన పని తాను చేసుకు పోతుందన్నారు. నేతల తలరాతను మార్చే వజ్రాయుధం ఓటు అనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఓటును అమ్ముకోవడం వలన మన జీవితాలను మనమే నాశనం చేసుకున్నట్లేనన్నారు. గ్రామంలో ఏవరైనా ఓటర్లను ప్రలోభ పెట్టిన, భయభ్రాంతులకు గురి చేసినా అటువంటి వారిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్‌మోహన్‌రావు, ఆర్ఐ దాసరి కాంతారావు, సెక్టార్ ఆఫీసర్ సుధాకర్‌రావు, వీఆర్వోలు మల్లిఖార్జునరెడ్డి, నాసరయ్య, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఎస్ఐ షేక్ జాన్‌సైదా

క్రోసూరు: తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ టి.షాలెంరాజు ఆదేశాల మేరకు మండలంలోని దొడ్లేరు, కొండూరు, గుడిపాడు, 88 త్యాళ్లూరు, క్రోసూరు గ్రామాల్లోని వ్యాపార సంస్థలు, ఎండీయూ వాహనాలను మంగళవారం తనిఖీ చేసినట్లు సత్తెనపల్లి తూనికలు కొలతల శాఖ అధికారి షేక్ జాన్‌సైదా తెలిపారు. పలు కిరాణా దుకాణాల్లో బియ్యం టిక్కీలు(25 కిలోల ముద్ర) ఉండగా 24 కిలోలు బియ్యం ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. కూల్‌డ్రింక్‌లు అధిక ధరలకు విక్రయించటం, ఎండీయూ వాహనాల ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యం తూనికలో అవతవకలున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీటికి సంబంధించి ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా తూనికల్లో తేడాలు గుర్తించినా, అధిక ధరలకు విక్రయించినా 9885127512 నంబరుకు సమాచారం అందించాలన్నారు.

16 మంది వలంటీర్ల రాజీనామా



సత్తెనపల్లి: నిస్సహాయులకు ఆసరాగా నిలిచి, స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న తమకు రాజకీయాలను ఆపాదించి, నిందలు వేయడం బాధాకరమని సత్తెనపల్లి పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలోని 25, 26 వార్డులకు చెందిన 16 మంది వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మనస్తాపం చెందిన తాము మూకుమ్మడిగా రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. మొత్తం 16 మంది తమ రాజీనామా పత్రాలను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మికి మంగళవారం అందజేశారు. సెల్‌ఫోన్‌లను స్వాధీన పరిచారు. ఇప్పుడు తమపై ఎలాంటి విమర్శలు చేసే అవకాశం లేదన్నారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి అంబటి విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

నాడు అధోగతి... నేడు పురోగతి

- ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లతో కళకళలాడుతున్న చర్లగుడిపాడు
- రూ.9.49 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు
- రూ.33.28 కోట్లతో సంక్షేమ పథకాలు
- ఏళ్ల తరబడి నెలకొన్న రహదారి సమస్య పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



చర్లగుడిపాడు గ్రామ సచివాలయం

గురజాల : గ్రామ స్వరాజ్యం సాకారం దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయి. గత టీడీపీ హయాంలో కనీసం మండలం కేంద్రాలకు దగ్గరగా ఉన్న గ్రామాలు సైతం అభివృద్ధికి నోచుకోలేకపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి బాటలు పట్టాయి. మండల పరిధిలోని చర్లగుడిపాడు గ్రామం గురజాల మండల కేంద్రానికి కేవలం 6 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అయినప్పటికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోలేదు.

కళకళలాడుతున్న పల్లె...

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చర్లగుడిపాడు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సీసీ రోడ్ల ఏర్పాటు, డ్రైనేజ్ సమస్య పరిష్కారం, గ్రామంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో గ్రామం కళకళలాడుతుంది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పాలన అందించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చర్లగుడిపాడులో అభివృద్ధి పనుల వివరాలు...

- నాడు–నేడు కింద పాఠశాలల్లో 26 పనులకు రూ.1.54 కోట్లు
- 2 గ్రామ వార్డు సచివాలయాలకు రూ.80 లక్షలు
- 7 ప్రాంతాల్లో సీసీ రోడ్లకు రూ.68 లక్షలు
- 1 ప్రభుత్వ భవనానికి రూ.10 లక్షలు
- 11 గ్రావెల్ రహదారులకు రూ.20 లక్షలు
- 4 బీటీ రహదారులకు రూ.3,14,50,000
- జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటుకు రూ.2,23,30,000
- 2 విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి రూ.35 లక్షలు

సంక్షేమంలో కొన్ని ఇలా...

- 264 మందికి ఇంటి స్థలాలు మంజూరు
- 773 మంది మహిళలకు డ్వాక్రా రుణమాఫీ రూ.1.84 కోట్లు
- 1118 మంది రైతులకు రైతు భరోసా, రుణమాఫీ రూ.5.12 కోట్లు
- 599 మందికి అమ్మ ఒడి కింద రూ.2.76 కోట్లలో
- పెన్షన్ కానుక 1033 మందికి గాను రూ.10.14 కోట్లు
- ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 263 మందికి గాను రూ.1.24 కోట్లలో



చర్లగుడిపాడు గ్రామంలో నిర్మాణం చేసిన డ్రైనేజ్



బీసీ కాలనీలో సీసీ రోడ్డు



ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు

మౌలిక వసతులు కల్పించాం...



ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరిగింది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారులు ఏర్పాటు చేయడం జరిగింది. డ్రైనేజ్ వ్యవస్థతో ప్రజలకు ఉపశమనం లభించింది. గ్రామం సర్వతోముఖాభివృద్ధి చెందింది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి చేశాం.

– సీనియర్ నాయకుడు వేముల చలమయ్య, చర్లగుడిపాడు

అభివృద్ధి బాగుంది...



చర్లగుడిపాడు గ్రామంలో ప్రస్తుతం అభివృద్ధి బాగుంది. కొత్తగా మా గ్రామంలో సచివాలయాలు వంటివి నిర్మాణం చేయడంతో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. గతంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయి. మాకు ఎంతో ఆనందంగా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన బాగుంది.

– కాయకోకుల అలివేలమ్మ, చర్లగుడిపాడు

పింఛన్ ఇంటికే వస్తుంది...



పింఛన్ ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. ఈ పద్ధతి బాగుంది. గతంలో పింఛన్ కోసం రోజుల తరబడి వేచి ఉండేవాళ్లం. కానీ నేడు 1వ తారీఖునే ఇంటి గడప వద్దకు వచ్చి పింఛన్ ఇస్తున్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు సైతం చేపట్టారు. సొంత ఊరిలోనే అన్ని సేవలు అందుతున్నాయి. గత పాలనకు ఈ ప్రభుత్వ పాలనకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. ప్రస్తుత ప్రభుత్వ విధానం బాగుంది.

– వడితే బుల్లి భాయ్, చర్లగుడిపాడు

సాయుధ బలగాల కవాతు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ప్రాంతం, వడ్డవల్లి, గచ్చిబౌలి సెంటరు, నాగన్న కుంట, శాలివాహననగర్‌లో స్థానిక పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శాంతి భద్రతలకు ఏమాత్రం విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, ఏఎస్ఐ సుబ్బారావు కవాతులో పాల్గొన్నారు.

రుద్రవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం, రుద్రవరం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో స్థానిక పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో వారు సమావేశమయ్యారు. ఎస్సై పి.హజరతయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు సిబ్బందికి సహకరించాలన్నారు. ఏఎస్సై ఇమామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.